గీతా సుబ్బారావు



# మంచి మనసులు

వర్షం జోరుగా పడుతోంది. చల్లగాలి హోరున వీస్తోంది. "ఛీఛీ... పాడు వర్షం! దీని మూలంగా... తెల్లవారిందీ లేనిదీ కూడా తెలియడంలేదు... అని తనలో తనే విసుక్కుంటూ... కిటకీ తలుపులు తీసింది భారతి.

"అబ్బ కిటికీ తలుపులు ముయ్యవే... చలివేస్తోంది!" అంటూ విసుక్కుంటూ... దుప్పటి నిండా లాక్కొని పడుకున్నాడు గోపీ.

"టైం ఎంతయిందో తెలుసా? తొమ్మిది అయింది!" చెప్పింది భారతి.

"అయితే అయిందిలే!... ఇవాళ బడి వుండదు... ఈ వర్షానికి హెడ్‌మాష్టారి రూమ్ కూడా... మునిగిపోయి ఉంటుంది" అన్నాడు గోపీ.

"అయితే... సాయంత్రం వరకూ నిద్రపోతావా..."

"చలి వణికిస్తోంది. ఏం చేసేదీ?" అన్నాడు గోపీ.

"ఒక్కసారి లే! నీకో... వింత చూపిస్తాను..." అంది భారతి.

"అబ్బ... తర్వాత చూస్తాను..."

"తర్వాత... కనిపించదు!... ఇప్పుడే చూడాలి?..." అంది భారతి.

గోపీ లేచి... నిండుగా దుప్పటి చుట్టుకొని... "ఏదీ... చూపించు!" అన్నాడు.

"అదిగో కిటికిలోంచి అటుకేసి చూడు..." అంది భారతి...

గోపీ కిటికిలోంచి బయటకు చూశాడు... హోరున వర్షం కురుస్తోంది.

"ఏముందీ... వర్షం!"...

"అక్కడ రోడ్డుమీద కాదు! ఆ ఎదురింటి చూరుకింద చూడు!..." అంది భారతి.

ఎదురింటి చూరుకింద... ఎవరో తల్లీ... ఇద్దరు పిల్లలూ వున్నారు... మెట్లమీద కూర్చొని... చలికి గజగజ వణికిపోతున్నారు! జల్లు కూడా వాళ్ళవేపే కొడుతోంది!...

"ఎవరో ముష్టివాళ్లు! అందులో వింత ఏముందీ?..." అన్నాడు గోపీ...

"ఆ కుర్రాడు కూడా నీ అంతే వున్నాడు... వాడికి చొక్కా కూడా లేదు!" అంది భారతి అటుకేసి చూస్తూ...

"ఏం చేస్తాం? వాడు పాపం చేసుకున్నాడు. అందుకే... అలా చలిలో వణుకుతున్నాడు. వర్షంలో తడుస్తున్నాడు..."

"వాడు చేసిన పాపం ఏమిటి?"

"ఏమో?... వాడికి నాన్నలేదు!... అదే పాపం!..." అన్నాడు గోపీ.

ఇంతలో... "అమ్మగారూ" అని ఎవరో తలుపు కొడుతున్నారు...

"భారతీ... పాలవాడు వచ్చినట్టున్నాడు! తలుపు తియ్యి!" అంటూ అమ్మ వంటగదిలో నుంచి అరిచింది! భారతి తలుపు తీసింది!

గోపీ అంత కుర్రాడు... వర్షంలో తడిసి ముద్దయిపోయి... గజగజ వణుకుతూ పాల జగ్గుతో నించున్నాడు.

"అమ్మగారూ! ఇవిగో పాలు! అయ్యకి జ్వరం వచ్చింది. అందుకని ఆలస్యం అయింది...!" భయపడుతూ చెప్పాడు.

"గోపీ! నీకోసం ఎవరో వచ్చారు... చూడు!..." అని కేకపెట్టి... భారతి పాల జగ్గు తీసుకొని లోపలికి వెళ్ళిపోయింది...

గోపీ.... గబగబా వీధి గుమ్మంలోకి వచ్చాడు.

పాలకుర్రాడు... గజగజవణుకుతూ... తడి బట్టలతో... దీనంగా నించున్నాడు.

గోపీ వాడికేసి చూసి ఆలోచిస్తూ నించుండిపోయాడు.

లోపల్నుంచి అమ్మ అరుస్తోంది... "రేయ్... రేపట్నుంచి పాలు ఇంత ఆలస్యంగా తీసుకు

---

నువ్వు ఈ హత్య చేయడానికి కారణం నీ త్రాగుడేనని అర్థమయిందా? జడ్జిగారు ప్రశ్నించారు బోనులో ముద్దాయిని.

హమ్మయ్య... ఈ హత్యకు కారణం నేనేనని ఒప్పుకోవాలని హడలి చస్తున్నాను... తేలిగ్గా నిట్టూర్చాడు ముద్దాయి.




వస్తే ఊరుకోను" అని...

"అట్టాగేనండీ!" అన్నాడు కుర్రాడు.

భారతి పాలజగ్గు తెచ్చి ఇచ్చింది.

గోపీ తాను కప్పుకున్న దుప్పటి విసిరి పారేసి పాలకుర్రాడితో -

"ఇప్పుడేవస్తాను ఉండు!" అంటూ లోపలికి వెళ్ళాడు.

భారతికి ఏమీ అర్థం కాలేదు!... గోపీ క్షణంలో పరుగెత్తుకువచ్చి... ఓ పాత చొక్కా పాల కుర్రాడికి ఇచ్చి 'ఇంటికి వెళ్ళాకా... వేసుకో!' అంటూ యిచ్చాడు.

పాల కుర్రాడి ముఖం గంపంత అయింది!...

"అక్కా! అమ్మకు చెప్పకు!" అన్నాడు గోపి.

"ఛా... నే చెప్పనుగా!"... అంది భారతి.

అక్కా తమ్ముళ్ళిద్దరూ వీధి తలుపువేసి గదిలోకి వచ్చారు...

కిటికీ దగ్గరి నుంచొని వర్షంలో వెళ్ళిపోతున్న పాల కుర్రాడిని చూస్తూ నించున్నారు...

పాల కుర్రాడు... ఎదురింటి ముందు ఆగాడు.

ఎందుకా? అని చూస్తున్నారు అక్కా తమ్ముళ్లు.

పాలకుర్రాడు గోపీ యిచ్చిన చొక్కా తీసి... చలికి వణుకుతున్న ముష్టి కుర్రాడికి ఇచ్చేసాడు...

అలా వర్షంలో తడుస్తూ వెళ్ళిపోయాడు. వర్షం కురుస్తూనే వుంది... గోపీ కిటికీలో నుంచి అలా చూస్తూనే వున్నాడు!... గోపీ కళ్ళలో... గిరిగిరా నీళ్లు తిరిగేయి!... వేడిగా... చెంపలమీద నుంచి జారాయి. ●